క్లుప్తంగా

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

డీసీపీ శ్రీనివాస్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ

ఇబ్రహీంపట్నం రూరల్: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదపడతాయని మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లిగేటు సమీపంలో హాస్టల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల(11)ను డీసీపీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. హాస్టల్ అసోసియేషన్ యజమానులు ఇంత చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ గోవింద్‌రెడ్డి, ఎస్‌ఐలు మారయ్య, మైబెల్లితో పాటు కౌన్సిలర్ కృష్ణంరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాయినాథ్‌కాలనీ కార్యవర్గం ఎన్నిక



కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని సాయినాద్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మల్లారెడ్డి, అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా నాగేందర్ నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రవీందర్ నాయక్, చక్రపాణి, ట్రెజరర్‌గా బ్రహ్మప్రసాద్‌ను ఎన్నుకున్నారు.

నియామకాల్లో అవకతవకలు జరిగాయి

డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ల నిరసన



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆర్టిజన్స్

తుర్కయంజాల్: ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ డివిజన్ కార్యాలయం ఎదుట సిబ్బంది ఆందోళనకు దిగారు. వివరాలు.. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన జూనియర్ లైన్‌మెన్ నియామకాల్లో డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆపరేషన్ ఇబ్రహీంపట్నం అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆర్టిజన్స్, జూనియర్ లైన్‌మెన్లు సోమవారం తుర్కయంజాల్‌లోని డివిజన్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఈ నియామకాల్లో టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలను బేఖాతరు చేసి నియామకాలు చేపట్టారని ఆరోపించారు.

ఆర్థికసాయం అందజేత



ఆమనగల్లు: మండలంలోని సింగంపల్లికి చెందిన సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. నాయకులు సత్యం, తానేశ్, వెంకటేశ్, శేఖర్, రవి, నాగేశ్, చింటు, శ్రీశైలం, లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

కేంద్రమంత్రికి ఘనస్వాగతం



పురుషోత్తంరూపాలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తిలో జరిగే బహిరంగ సభకు వెళ్తున్న కేంద్ర మంత్రి పురుషోత్తంరూపాలకు ఆమనగల్లు పట్టణంలో బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్ ఆయనను సన్మానించారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో బీజేపీ గెలుపు ఖాయమని నినాదాలు చేశారు. నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు.

వైభవంగా శరన్నవరాత్రి

ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు శాకాంబరీదేవి, బాలాత్రిపురసుందరి తదితర అలంకరణల్లో దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో యాగం, అన్నదానం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడారు. ఆలయాల్లో ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు నవారాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: పూజలో కాంగ్రెస్ నేత మధుసూదన్‌రెడ్డి దంపతులు తదితరులు



తలకొండపల్లి: బతుకమ్మతో ఎంపీపీ నిర్మల



ఆమనగల్లు: యాగంలో ఆర్యవైశ్య సంఘం నేతలు




కడ్తాల్: మైసిగండిలో..



ఇబ్రహీంపట్నం: బాలా త్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు



కడ్తాల్: ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణేశ్వరీ దేవి



నాగోలు: గాయత్రీ దేవిగా మహంకాళీ అమ్మవారు

రికార్డు తిరగరాస్తారా?

- నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేలుగా లక్ష్మీనర్సయ్య, కిషన్‌రెడ్డి
- నాలుగోసారి గెలుపుపై కన్నేసిన కిషన్‌రెడ్డి
- ప్రచారంలో దూకుడు



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఖరారైనప్పటినుంచి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. తాజాగా సోమవారం సీఎం కేసీఆర్ చేతులమీదుగా కిషన్‌రెడ్డి బీఫామ్ అందుకున్నారు. ఇకపైనుంచి ప్రచారంలో మరింత దూకుడు పెంచనున్నారు. అయితే నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 16 సార్లు ఎన్నికలు జరగగా వరుసగా మూడుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సాధించింది ఇద్దరే. 1957, 1962, 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మీనర్సయ్య వరుస విజయాలను సొంతం చేసుకున్నారు. ఈ రికార్డును మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమం చేశారు. మంచిరెడ్డి టీడీపీ అభ్యర్థిగా 2009, 2014 ఎన్నికల్లో, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా 2018 ఎన్నికల్లో వరుస విజయాలను అందుకున్నారు. వీరిద్దరూ నియోజకవర్గంలో హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రంగంలో ఉన్న కిషన్‌రెడ్డి నాలుగోసారి గెలిస్తే రికార్డు సృష్టిస్తారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీనర్సయ్య హ్యాట్రిక్ రికార్డు బద్దలౌతుంది. అయితే ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున 1981, 1983లో ఏజీ కృష్ణ, సీపీఎం పార్టీ తరుపున 1989, 1994లో కొండిగారి రాములు రెండేసి సార్లు విజయం సాధించారు. ఆరుగురు ఒక్కోసారి విజయం సాధించారు. అయితే ఈసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలిస్తే లక్ష్మీనర్సయ్య రికార్డును బ్రేక్ చేసినట్లు అవుతుంది.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

నాగోలు: బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. కొత్తపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం శ్రీలక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ వైభవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉప్పల శ్రీనివాస్ గుప్త విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలందరూ బాగుండాలని, సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో సోమిశెట్టి నాగరాజు స్వామి, ప్రెసిడెంట్ శ్రీకాంత్‌శేరి పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్త తదితరులు

మరోసారి ఆశీర్వదించండి

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేశామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని మంత్రి సబితారెడ్డి విజ్ఞప్తి చేశారు. సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డి సమక్షంలో పలువురు సోమవారం బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో అనేక ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యను అధిగమించడంలో భాగంగా స్కై, ఫ్లైఓవర్ల నిర్మాణాలు చేపట్టామని అన్నారు. నగరం నుంచి కందుకూరు వరకు మెట్రోరైల్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టామని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకుని రూ.1200 కోట్ల వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు పారుపల్లి దయాకర్‌రెడ్డి, రిషీ, రాఘవేంద్రగుప్తా పాల్గొన్నారు.



సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు

కసిరెడ్డిని గెలిపించుకుందాం



ప్రచారంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా సోమవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని ముద్వీన్, కొర్రకొండ తండాల్లో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టబోయే 6 గ్యారంటీ స్కీంల గురించి వివరించారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ప్రజలు కసిరెడ్డిని, హస్తం పార్టీని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, నాయకులు దర్శన్, ప్రవీన్, క్రాంతి, నవీన్, జశ్వంత్, శివ, విజయ్, చరణ్ పాల్గొన్నారు.

అమలుకాని హామీలిస్తున్నారు

టీసీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధవరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అమలు కాని హామీలిస్తున్నాయని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(టీసీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మాధవరెడ్డి విమర్శించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. అంగట్లో వేలంపాట పాడినట్లుగా ఒకరిని మించి ఇంకొకరు అమలుకాని హామీలు ఇస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా పట్టించుకోని ప్రభుత్వం మద్యం దుకాణాల సంఖ్యను పెంచడం దేనికి సంకేతమన్నారు. ప్రధాని మోడీ పారిశ్రామిక వేత్తలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తరపున నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శేఖర్, నరేందర్, వెంకటరెడ్డి, ముస్తఫ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నేతలు

కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం



మేయర్ పారిజాత సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

పహాడీషరీఫ్: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత స్పష్టం చేశారు. జల్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు యాకుబ్, బాబు, రియాజ్ తదితరులు పెద్ద సంఖ్యలో ఆదివారం రాత్రి మేయర్ పారిజాత సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీలో శంకుస్థాపనలు చేస్తున్నారు తప్ప పనులు జరగడం లేదన్నారు. మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రియాజ్ ఖాన్, మౌనికా రెడ్డి, అఫ్జల్ అహ్మద్, షరీఫ్, ఇమ్రాన్, యూసుఫ్‌ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

నాభిశిలా ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నాభిశిలా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో నాభిశిల విగ్రహాన్ని ఊరేగించారు. ఎంపీపీ రేఖమహేందర్‌గౌడ్, సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, ఎంపీటీసీ తాటిపల్లి సౌమ్యరమేష్‌గౌడ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- బూత్ కన్వీనర్లకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం గడ్డ రాజకీయ చైతన్యానికి అడ్డా అని ఇక్కడి ప్రజలు అభివృద్ధికే పట్ట కడతారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలో సోమవారం ఆదిబట్ల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన ఆదిబట్ల మున్సిపాలిటీ బూత్ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రజలు తప్పకుండా అభివృద్ధికే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.2,991 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ప్రకటించిన సంక్షేమ పథకాలే కాకుండా అనేక పథకాలను ప్రజలకు అందించామన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో..

ఈసారి ఎన్నికల మేనిఫెస్టోను సైతం పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టో ఉందన్నారు. మహిళలకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిందని తెలిపారు. ప్రతి ఇంటికి పౌష్టికహారం అందించాలనే తపనతో ప్రభుత్వం సన్నబియ్యం అందించేందుకు సిద్ధమైందన్నారు. ఆరోగ్యశ్రీ బీమాను రూ.15 లక్షలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెల్లరేషన్ కార్డుదారులకు రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. బీఫామ్‌తో తిరిగి వచ్చాను మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూత్ కన్వీనర్లు బాగా పనిచేసి గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు రాంరెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, కౌన్సిలర్లు మహేందర్, కృష్ణరాజు, కోఆప్షన్ సభ్యులు రసూల్, నాయకులు జంగయ్య, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ సదస్సు

మంచాల: మంచాలలో మంగళవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ సదస్సుకు కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

పేదలకు అండగా కేఎంఆర్ ట్రస్ట్

ట్రస్టు చైర్మన్ మనోహర్‌రెడ్డి

పహాడీషరీఫ్: కేఎంఆర్ ట్రస్ట్ పేదలకు అండగా నిలుస్తుందని ఆ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాంకాలనీకి చెందిన పుష్పలతకు 60 గజాల నివాస స్థలానికి సంబంధించిన పట్టాను సోమవారం మనోహర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్‌పల్లిలో నివాసం ఉంటున్న ఎంతోమంది పేదలకు తమ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన రేఖ, సుగుణమ్మ, జ్యోతి, సత్యదేవ, పావని, హమీద, అనిత, రియాన బేగం, కృష్ణవేణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



మహిళకు నివాస స్థలం పట్టా అందజేస్తున్న మనోహర్ రెడ్డి

సబితమ్మను గెలిపించుకుందాం



ఆకులమైలారంలో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

కందుకూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా అమలు కావడంలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ కొనియాడారు. సోమవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శంకర్ తిరుపతయ్య, స్థానిక సర్పంచ్ కలమ్మరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గంలో మంత్రి సబితారెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఆకులమైలారం మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం, మెడికల్ కళాశాల లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు నియోజకవర్గంలో వచ్చాయని, మరెన్నో రానున్నాయన్నారు. మరోసారి సబితారెడ్డి గెలుపునకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డి.నందీశ్వర్, ఉపసర్పంచ్ రాంరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, దశరథ, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు భిక్షపతి, ఎంపీటీసీ రాములు, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, ఆనంద్, సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దర్శన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, జంగయ్య, పాండు, సురేష్, మహేందర్, బీరప్ప, మల్లయ్య, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దమ్మతండాలో...

పెద్దమ్మతండాలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు లచ్చానాయక్, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, స్థానిక సర్పంచ్ సుమన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సబితమ్మను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేక్యానాయక్, బీసీసెల్ అధ్యక్షుడు పాండుగౌడ్, రాంచందర్, కుమార్, బాల్‌రాజు, తేజనాయక్, విజయ్, శంకర్‌నాయక్, వస్యానాయక్, నారాయణ, వినోద్, సురేష్ పాల్గొన్నారు.

‘బెంగళూరు నేతలకు కాంగ్రెస్ నేతలు గులాంలు’

ఎల్‌బీనగర్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు బెంగుళూరు నేతలకు గులాములని, బెంగుళూరు నేతలు ఢిల్లీ నేతలకు గులాములుగా మారారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ యెగ్గే మల్లేషం, మాజీ కార్పొరేటర్లతో కలసి సోమవారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి టిక్కెట్లు అమ్ముకుంటుంటే రేటేంత రెడ్డిగా మారారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ధీమా ప్రతి ఇంటికి ధీమా అని అభ్యర్థులుగా ప్రకటించుకుంటున్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు సాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.